కథ



టోకోఫోబియా.... ఐ హేట్‌యూ... అతను మనసులో అనుకున్నాడు.

పెళ్లైన ఆరునెలలుగా అతనికీ విచిత్రానుభవం విషాదమే.

అతడి పేరు కాశ్యప్... అనురాగ్ కాశ్యప్.

ఆమె పేరు మృదువని... ఇంట్లో హనీ అని పిలుస్తారు.

వాళ్లిద్దరికీ పెళ్లై ఆరునెలలు అయింది. అతనికి ఆమెలో మిస్ ఇండియా, మిస్ యూనివర్స్‌ల కొలతలకన్నా తన మిసెస్‌కు ఉండవలసిన, తను కోరుకున్న అర్హతలు చాలా కనిపించాయి. సింపుల్‌గా ఉండే ఆమె చీరకట్టు, నవ్వినప్పుడు సొట్టలు పడే ఆ బుగ్గలు, నడుమ్మీద అతనికిష్టమైన అందమైన మడత, చూపులతో 'మొగుడికి మాత్రమే' ప్రోవకేటింగ్‌గా కనిపించే ఆమె నడత.... ఇవన్నీ అతనికి ఇష్టమైన విషయాలు.

పెళ్లిచూపుల్లో ఆమె పొడవాటి చేతివ్రేళ్ళు కాఫీ కప్పు ఇస్తున్నప్పుడు తగలగానే అతనికి కాఫీ రుచి మారిపోయినట్టు అనిపించింది. కాఫీ రుచిలో పెదవుల స్పర్శ తగిలేది.

అతను ఆమెను ఒకే ప్రశ్న అడిగాడు "నేను నచ్చానా?"

ఆమె పెదవులు వణికేయి. తలకిందికి వాల్చింది. నునుసిగ్గు ఔననే ఆన్సర్‌ని

# థాంక్యూ...

సూరేపల్లి విజయ

"అతడామె నుదురును చుంబించాడు. ఆమె పరవశంతో వివశత్వానికి లోనైంది. అతడామె కంఠాన్ని ముద్దాడాడు. ఆమె కనురెప్పలు మూతపడ్డాయి. ఆతడామె హృదయభాగాన్ని పెదవులతో స్పృశించాడు. ఆమె మనసు పొరల్లో వేనవేల తుపానులు చెలరేగాయి. రోమాంచిత తీరాల్ని దాటాయి. ఆమె నాభి అతనికి అయస్కాంత క్షేత్రమైంది. భూమధ్యరేఖను దాటిన అతనికి ఒక్కసారిగా విరహాల ఉప్పెన చుట్టుముట్టింది. అతడ్ని అల్లుకుపోవలసిన ఆమె విడివడి, భయపడి, సిగ్గుపడి అటు తిరిగి పడుకుండిపోయింది"

చెప్పింది.

పెళ్ళయ్యింది. మొదటిరాత్రికి అత్తవారిల్లే వేదిక అయింది.

పాలగ్లాసుతో మృదువని లోపలికి అడుగుపెట్టింది. అతని చేతికి పాల గ్లాసు ఇచ్చి, పాదాలకు నమస్కారం చేయడానికి కిందకు వంగింది. అతను పాలగ్లాసు టీపాయ్‌మీద పెట్టి ఆమె భుజం మీద చేయి వేసి పైకి లేపి అన్నాడు.

''నువ్వుండాల్సింది ఇక్కడ..... ఈ గుండెల్లో'' అంటూ ఆమె తలను తన గుండె దగ్గరికి చేర్చుకున్నాడు. ఆమె ఒక్క క్షణం అలానే కళ్లు మూసుకుంది. అతని గుండె చప్పుడు స్పష్టంగా ఆమెకు వినిపిస్తోంది. అనురాగ్ కాశ్యప్ ఆమె వీపు చుట్టూ చేయి వేశాడు. ఆ చేయి ఆమె జాకెట్ కింది భాగం నుంచి నడుం భాగానికి వచ్చింది.

ఆమెను మంచం మీద కూచోబెట్టి ఆమె నడుం ఒంపు మడత మీద ముద్దుపెట్టుకున్నాడు. ఆమె చేతివ్రేళ్ళు అతని జుట్టును చెరిపేశాయి.

అలానే ఆమెను వెల్లకిలా పడుకోబెట్టి ఆమెతో ఐక్యమయ్యే సమయాన ఆమె ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అతన్ని అతికష్టమ్మీద వెనక్కి తోసింది.

అతను ఉలిక్కిపడ్డాడు. అతని అహం దెబ్బతిన్నది. ''మృదువనీ'' అతను కించిత్ ఉక్రోషంతో పిలిచాడు.

ఆమె భారంగా ఒదిగి కూచుంది.

''ఏ.... ఏమిటిది? ఈ పెళ్లంటే నీకిష్టం లేదా?''

ఆమె కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

అతనికి ఆమె మీద జాలి వేసింది. ''ఆల్‌రైట్.... నేను మీ పెద్దవాళ్లతో మాట్లాడతాను. నువ్వు ప్రేమించినతనితోనే నీ పెళ్లి జరిపిస్తాను. యూ డోంట్ వర్రీ...నేను విడాకులిస్తాను'' అతను అన్నాడు.

పరిగెత్తుకు వచ్చి అతని గుండెల మీద వాలిపోయింది. అతడ్ని కరుచుకుపోయింది.

అతను అయోమయావస్థలో పడిపోయేడు. ''మీరు... మీరంటే నాకు చాలా ఇష్టం. బోల్డంత ఇష్టం'' గాలి కూడా దూరనంతగా అతడ్ని కరుచుకుపోయింది చెప్పింది.

''మరి......మరి ఏమిటిదంతా?'' అతను విస్తుపోయి అడిగాడు.

''భ....యం''చెప్పింది మృదువని.

''భ....య....మా...ఎవరంటే?''

''సెక్స్ అంటే.........'' ఆమె అతి సిగ్గుపడుతూ ఒక్కో అక్షరాన్ని చెప్పింది.

''భయం దేనికి.......ఎమ్మెస్సీ చదువుకున్నావు. సైన్స్ గురించి, సెక్స్ గురించి, ఆ రెంటి గురించీ తెలియదా?'' అడిగాడు కాశ్యప్.

ఆమె కొద్దిగా తేరుకుంది. ''భయం కేవలం సెక్స్ గురించి కాదు. ప్రెగ్నెన్సీ గురించి. డెలివరీ గురించి.. ఆ పురిటి నొప్పులు నేను భరించలేను. నాకు భయం''

ఒక్క క్షణం అతనికి నవ్వూ, కోపమూ రెండూ వచ్చాయి.

ఒక్క క్షణం జాలీ, బాధ రెండూ కలిగాయి.

అతనో నిర్ణయానికి వచ్చాడు. తను బలవంతపెడితే ఆమె నిర్ణయం, భయం మరింత బలపడుతాయి.

''ఆల్‌రైట్ మృదువనీ.... నువ్వేం వర్రీ అవ్వకు.... ప్రస్తుతానికి మనం శోభనం వాయిదా వేద్దాం. ఈ విషయం మీ ఇంట్లో వాళ్లకు తెలియనివ్వకు. ఫీలవుతారు.. మనం మన ఇంటికి వెళ్ళేక ఈ సంగతి ఆలోచిద్దాం'' చెప్పాడు కాశ్యప్.

''చాలా థాంక్సండీ...నన్నూ నా ఫీలింగ్స్‌ని అర్థం చేసుకున్నారు'' అంది మనస్ఫూర్తిగా మృదువని.

* * *

అలా మూడు నిద్రలు అత్తవారింట్లో చేసి శోభనం ముచ్చట్లు జరిగాయని వాళ్లను నమ్మించి, భార్యను తనతో పాటు తనింటికి తీసుకువచ్చాడు.

అనురాగ్ కాశ్యప్ ఒంటరి. అతని తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. స్వయంకృషితో ఎదిగినవాడు అతను.

విశాలమైన ఇల్లు....పెద్ద బెడ్రూం.... హాలు, కిచెన్, మ్యూజిక్ సిస్టం, హోం థియేటర్. రాబోయే భార్య కోసం ముందే అన్నీ సమకూర్చి పెట్టుకున్నాడు.

''ఇల్లు చాలా బావుంది. ఇంత పెద్ద ఇంట్లో మన మిద్దరమే కదా'' అంది మృదువని.

''అవును'' అన్నాడు కాశ్యప్. చిన్నపిల్లలా ఆ ఇల్లంతా గంతులేస్తూ తిరిగింది.

* * *

ఆ రాత్రి ఎప్పటిలా తొందరపడలేదు. భార్య మానసిక పరిస్థితిని అంచనా వేస్తూ దగ్గరకు తీసుకున్నాడు. ''చూడు మృదువనీ... భార్యభర్తల మధ్య సెక్స్ ఎంత నేచురలో, ప్రెగ్నెన్సీ కూడా అంతే. అమ్మతనానికి అర్థం చెప్పేది మాతృత్వమే'' లాలనగా చెప్పాడు.

''మా అక్క డెలివరీ టైంలో చనిపోయింది. మా ఫ్రెండ్‌ని ఇంటర్‌లో ఒకడు రేప్ చేశాడు. తను సూసైడ్ చేసుకుంది'' చాలా అమాయకంగా చెప్పుకుంటూ పోతోంది. అలా చెబుతూనే అతని ఒడిలో అలానే పడుకుండిపోయింది.

ఎదురుగా నోరూరించే మిఠాయి పెట్టుకుని తినకూడని షుగర్ పేషెంట్ పరిస్థితిలా ఉంది అతని దుస్థితి.

* * *

ఆరోజు భార్యను తనకు తెలిసిన సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకువెళ్లాడు. అతను కేవలం ఓ రెండు నిముషాలు మృదువనితో మాట్లాడి, ఆమెను బయట కూచోమని చెప్పి కాశ్యప్‌తో మాట్లాడాడు.

''మిస్టర్ అనురాగ్! ఇది చాలా కామన్ విషయం. దీనికి మీరు ఓ 'మందు'లా పనిచేయాలి. బిడ్డలు కనే వయసులో ఉన్న ప్రతీ ఏడుగురు మహిళల్లో ఒకరు ఇలాంటి ఫోబియాతో బాధపడుతూ, భర్తలను బాధపెడుతూ ఉంటారు''

దీనిని టోకోఫోబియా అంటారు. దీనికి కారణాలు ఉంటాయి. ప్రసవం వల్ల భవిష్యత్తులో అనారోగ్యసమస్యలు తలెత్తుతాయనో, తన కెరీర్ కుంటుపడుతుందనో భయపడేవాళ్ళు కొందరయితే కౌమారదశలో భయం గొలిపే అనుభవాలు ఎదుర్కొన్నవాళ్ళు, గతంలో డిప్రెషన్‌కు లోనైనవాళ్ళు కూడా టోకోఫోబియాకు గురవుతారు.

ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పెద్దవాళ్ళు ధైర్యం చెప్పేవాళ్ళు. ఇంట్లోనే ప్రసవం జరిగేది కూడా. అంతా తనవెంటే ఉంటారన్న ధైర్యం కూడా ఉంటుంది. ఇప్పుడలా కాదు కదా. అదో భయం కూడా విడిగా, ఒంటరిగా ఉండే జంటల్లో ఉంటుంది'' అంటూ కాశ్యప్ ఏం చేయాలో సూచించాడు.

* * *

''డాక్టర్... అదే ఆ సైకియాట్రిస్ట్...ఏం చెప్పారు?'' అడిగింది ఇంటికొచ్చాక భర్తను మృదువని.


''ప్రెగ్నెన్సీ విషయం వదిలేయండి. కనీసం మీరు భార్యాభర్తలుగా హేపీగా ఉండండి అని చెప్పాడు'' నవ్వుతూ అన్నాడు కాశ్యప్.


ఆ రాత్రి భార్యతో చెప్పాడు కాశ్యప్. ''మీ వాళ్లను వచ్చి కొన్ని రోజులు ఉండి వెళ్లమని చెప్పు.....నీకీ ఒంటరితనం పోతుంది''

''అలాగే'' అంది సంతోషంగా మృదువని.

* * *

ఉదయం లేస్తూనే అడిగాడు కాశ్యప్.






''మృదువనీ..... నేనంటే నీకు చాలా ఇష్టం కదూ''

''అదేమిటి... అలా అంటారు చెప్పానుగా మీరంటే బోల్డు ఇష్టం'' అంది మృదువని.

''భార్యాభర్తల మధ్య ఏ బిడియమూ ఉండకూడదు కదా''

''కూడదు....'' అంది మృదువని.

''అయితే మనం కలిసి స్నానం చేద్దాం..... ప్రతి రోజూ''

ముందు కొద్దిగా సిగ్గుపడింది. ఆ ఆలోచన ఆమెలో వేడిని రాజేసింది. భార్యాభర్తల మధ్య రొమాన్స్ లేని జీవితం, కూరలో ఉప్పులేనట్టుగా చప్పగా ఉంటుందిట... ఓ కథలో చదివాను'' చెప్పాడు కాశ్యప్.

నవ్వి బాత్రూం వైపు నడిచింది మృదువని.

మొదటిసారిగా అభ్యంగనగా, మరో వ్యక్తితో కలిసి (తన భర్తతో) స్నానం చేసింది. చిత్రంగా క్షణాల్లో బెరకు, బిడియం, ఎగిరిపోయాయి. ఓ చిన్న సైజు ఇంటిలా ఉన్న ఆ బాత్రూంలో నాలుగు వైపులా ఇంటీరియర్ మిర్రర్స్ ఉన్నాయి వాళ్ల ప్రతి మూమెంట్‌ని ప్రతిబింబిస్తూ....

నిజంగా ఇలాంటి రొమాంటిక్ మూమెంట్స్ సినిమాల్లో, కథల్లో కాకుండా నిజంగా జరుగుతాయా అన్న డైలమా ఆమెకిప్పుడు లేదు. మనసైన భర్త, మనసెరిగే భర్త ఉంటే సాధ్యమే. శృంగారానుభవవేద్యమే!

భోజనంలో షడ్రుచులూ......రొమాన్స్‌లో అంతకు రెట్టింపు రుచులే. అని ఆమెకు అప్పుడే...అక్కడే తెలిసింది. ముద్దులు, ముచ్చట్లు... కౌగిళ్ళు..... దంతక్షతాలు.

బాత్రూంలో నుంచి హీటర్‌లా బయటకు వచ్చింది మృదువని.

* * *

''మృదువనీ... ఒక్క పగలు మనం బ్రతకడం కోసం కష్టపడతాం. ఒక్క రాత్రి....మనం ఒక్కటిగా, ఐక్యమవ్వడం కోసం ఐక్యమవ్వడం కోసం ఖర్చుపెడతాం. ఒకే గదిలో, ఒకే మంచమ్మీద, దూరంగా పడుకోవడం భావ్యమా?'' అడిగాడు కాశ్యప్.

మృదువని 'కాదు' అన్నట్టు తలూపింది.

''మరింకేమిటి? మన మధ్య ప్రెగ్నెన్సీకి దారి తీసే కలయిక అక్కర్లేదు. కనీసం ఒకరినొకరం హత్తుకుని పడుకుందాం'' అన్నాడు.

అతని మాట పూర్తికాకుండానే ఆమె అతడ్ని కరుచుకుపోయింది.

* * *

ఆరునెలలు గిర్రున తిరిగిపోయాయి.

ఈ ఆరునెలలు వాళ్ల మధ్య మానసిక సాన్నిహిత్యం పెరిగింది. అతని ప్రెజెన్స్‌ని ఆమె అమితంగా ఇష్టపడుతోంది. వయసు తాలూకు అల్లర్లు. భర్తగా అతను అందించే ప్రేమ. రోజూ కలిసే స్నానం చేయడాలు... ఇవన్నీ ఆమెలోని శృంగార మధురోహలను ప్రోది చేస్తూనే ఉన్నాయి.

ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది.

* * *

మల్లెపూలు...తెల్లచీర... మత్తెక్కించే పెర్ఫ్యూమ్.....ఆ గది శోభనం స్పెషల్‌గా మారింది.

''మైగాడ్...ఆరునెలల విరహాన్ని ఒక్క రాత్రితో కాంపెన్సేట్ చేసావా'' అన్నాడు తెల్లవారుజామున ఆరోసారి అలిసిపోయిన కాశ్యప్ ఆమె అనాచ్ఛాదిత శరీరంపై సేదతీరుతూ.

''మైగాడ్ కాదు... మై మృదువనీ అనండి. మీరు గుండెల్లో ఉంటేనే ఈ ఆరునెలలు నేను అమృతం తాగినంత ఆనందంగా ఉన్నాను. గుండెల్లో ఉన్న మీరు, నా కడుపులో ప్రతిరూపంగా పెరిగితే....'' ఆమె కళ్ళు చెమర్చాయి. బలమైన కోరిక ఉధృతంగా మారి అతడ్ని ఉప్పెనలా చుట్టుముట్టింది.

మీలాంటి భర్త తోడుంటే ఏ ఫోబియాలు భార్యల దరిచేరవు. నాకు మీ తోడు చాలు. మీ ప్రెజెన్స్, మీరు ఉన్నారన్న సెక్యూర్డ్ ఫీలింగ్ చాలు.

మన ప్రపంచంలో మీరు, నేను...మన బిడ్డ! రెండు శరీరాల మధ్య వేడి మాత్రమే పుడుతుందనుకున్నాను. ఉద్వేగం పుడుతుందని, అనుభవం కమ్మని కలలా మిగులుతుందని, అనుభూతి ప్రతిరూపంగా కడుపులో పెరుగుతుందని తెలుసుకోలేకపోయాను''

అతను మాట్లాడ్డం లేదు. ఆమె మాటలు మంత్రాక్షరాల్లా వింటున్నాడు. ప్రతీభార్యా ఇలానే ఆలోచించాలి. ప్రతీ భర్తా ఇలాగే ఉండాలి. అనిపించేంతగా అతను మౌనంగా ఉన్నాడు.

వాళ్లిద్దరి మధ్య నిశ్శబ్దం. అనుభూతిగా మారుతోంది.

మరోసారి ఆ గదిని వెచ్చబర్చడానికి రోమాంఛితానుభవం ఆయత్తమవుతోంది.

★